# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 29-06-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- భారతదేశాన్ని ట్రకోమా రహిత దేశంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) ప్రకటించిందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.
- జాతీయ పసుపు బోర్డు ప్రధాన కార్యాలయాన్ని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రారంభించారు.
- రైలు బయలుదేరడానికి ఎనిమిది గంటల ముందుగానే రిజర్వేషన్ చార్టులను తయారు చేసే ప్రక్రియను ప్రారంభించాలని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ రైల్వే బోర్డును ఆదేశించారు.
- నైరుతి రుతుపవనాలు ఈరోజు దేశవ్యాప్తంగా విస్తరించాయి.

==============================

ఆరోగ్యం నుంచి సామాజిక భద్రత వరకు... దేశం ప్రతి రంగంలోనూ సంతృప్తి భావనతో ముందుకు సాగుతోందని, ఇది సామాజిక న్యాయానికి నిదర్శనమని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. “మన్‌కి బాత్ మనసులోని మాట” 123 సంచికలో దేశ ప్రజలనుద్దేశించి ఈ రోజు ఆయన ప్రసంగించారు. అంతర్జాతీయ కార్మిక సంస్థ (ILO) నివేదిక గురించిప్రస్తావిస్తూ... భారతదేశ జనాభాలో 64 శాతం కంటే ఎక్కువ మంది ప్రజలు సామాజిక భద్రత ప్రయోజనాలను పొందుతున్నారని అన్నారు. 2015 వరకు దేశంలోని 25 కోట్ల కంటే తక్కువ మందికి ప్రభుత్వ పథకాలు చేరేవని, నేడు దాదాపు 95 కోట్ల మంది ప్రజలు సామాజిక భద్రతా పథకాల ప్రయోజనాన్ని పొందుతున్నారని ప్రధానమంత్రి తెలిపారు.

భారతదేశాన్ని ట్రకోమా రహిత దేశంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూ హెచ్ఓ) ప్రకటించిన విషయాన్ని ప్రజలతో పంచుకున్నారు. లక్షలాది మంది కృషి ఫలితంగా ఇది సాధ్యపడిందని చెప్పారు. స్వచ్ఛ భారత్ అభియాన్, జల్ జీవన్ మిషన్ లు కూడా ఈ విజయానికి ఎంతో దోహదపడ్డాయని అన్నారు. ఈ వ్యాధిని నిర్మూలించడంతో పాటూ దాని మూలకారణాలను సైతం భారతదేశం దూరం చేసిందని డబ్ల్యూ హెచ్ఓ ప్రశంసించిందని ప్రధానమంత్రి పేర్కొంటూ...

(వాయిస్ 40 సెకన్లు)

ప్రజా భాగస్వామ్య శక్తితో సంక్షోభాలను ఎదుర్కోవచ్చని, అత్యవసర పరిస్థితి రోజులను గుర్తు చేస్తూ.. ప్రధానమంత్రి మాట్లాడారు. ఈ పరిస్థితి విధించిన వారు రాజ్యాంగాన్ని హత్య చేయడమే కాకుండా, న్యాయవ్యవస్థను తమ బానిసగా ఉంచుకోవాలనే ఉద్దేశ్యాన్ని కలిగి ఉన్నారని ఆయన అన్నారు. దేశంపై అత్యవసర పరిస్థితి విధించి 50 సంవత్సరాలు పూర్తయిందని, దేశ ప్రజలు కొద్ది రోజుల క్రితం "సంవిధాన్ హత్య దివాస్"ను పాటించారని నరేంద్ర మోదీ అన్నారు.

(వాయిస్ 40 సెకన్లు)

అస్సాంలోని బోడోలాండ్ నేడు దేశంలో కొత్త గుర్తింపును పొందిందని.. దేశ క్రీడా రంగంలో బోడోలాండ్ స్థానం సంపాదించుకుంటోందని చెప్పారు. అక్కడి యువతలో ఉన్న శక్తి, విశ్వాసం ఫుట్‌బాల్ మైదానంలో కనిపిస్తోందని అన్నారు. బోడో టెరిటోరియల్ ప్రాంతంలో, బోడోలాండ్ CEM కప్ నిర్వహించబడుతోందని, ఇది ఐక్యత, ఆశల వేడుకగా మారిందని ప్రధానమంత్రి అభివర్ణించారు.

(వాయిస్ 30 సెకన్లు)

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రైలు బయలుదేరడానికి ఎనిమిది గంటల ముందు రిజర్వేషన్ చార్టులను తయారు చేసే ప్రక్రియను దశలవారీగా ప్రారంభించాలని రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ రైల్వే బోర్డును ఆదేశించారు. ఈ నిర్ణయం వెయిట్‌లిస్ట్ టిక్కెట్లు ఉన్న ప్రయాణీకులకు సందిగ్ధతలను తగ్గిస్తుంది. మధ్యాహ్నం 2 గంటలకు ముందు బయలుదేరే రైళ్ల కోసం ముందు రోజు రాత్రి 9 గంటలకు చార్ట్‌ను సిద్ధం చేయాల్సి ఉంటుంది. టికెటింగ్ వ్యవస్థ స్మార్ట్ గా, పారదర్శకంగా, అందుబాటులో ఉండే విధంగా సమర్థవంతంగా ఉండాలని కేంద్రమంత్రి చెప్పారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పసుపు ఎగుమతులు 2030 నాటికి ఒక బిలియన్ డాలర్లకు చేరాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. ఈ రోజు తెలంగాణ రాష్ట్రం నిజామాబాద్‌లో జాతీయ పసుపు బోర్డు ప్రధాన కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ.. నిజామాబాద్‌కు జాతీయ పసుపు బోర్డును మంజూరు చేసి.. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పసుపు రైతులు, ప్రజల 4 దశాబ్దాల కలను నెరవేర్చారని అన్నారు. పసుపు రైతుల సంక్షేమానికి కేంద్రం కట్టుబడి ఉందని పేర్కొంటూ... నిజామాబాద్ చుట్టుపక్కల ప్రాంతాలలో ఉత్తమ నాణ్యత కలిగిన దిగుబడి పొందుతున్నప్పటికీ పసుపు రైతులు తగిన ధరను పొందలేకపోతున్నారని అన్నారు. ఈ బోర్డు ద్వారా రైతులకు నూతన నైపుణ్యాలు, పద్ధతులను అందిస్తామని చెప్పారు. పసుపులో ఉండే ఔషధ విలువలను తెలియజేస్తూ... పసుపుకు ఉన్న వైద్య సంబంధ ప్రాధాన్యతను ప్రపంచం తెలుసుకుందని అన్నారు.

(వాయిస్ 30 సెకన్లు)

ఈ కార్యక్రమంలో కేంద్ర బొగ్గు గనుల మంత్రి జి కిషన్ రెడ్డి, హోం శాఖ సహాయ మంత్రి బి సంజయ్ కుమార్ పాల్గొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఒడిశాలోని పూరీలో శారదబాలిలోని శ్రీ గుండిచా ఆలయం సమీపంలో ఈ రోజు జరిగిన తొక్కిసలాటలో ముగ్గురు భక్తులు మరణించగా, వీరిలో ఇద్దరు మహిళలు ఉన్నారు. పలువురు గాయపడ్డారు. మరణించిన వారికి రాష్ట్ర

ప్రభుత్వం 25 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్ర దేవీలను రథాలపై దర్శనం చేసుకోవడానికి భారీగా జనసమూహం గుమిగూడినప్పుడు ఈ  సంఘటన జరిగింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

నైరుతి రుతుపవనాలు ఈరోజు దేశవ్యాప్తంగా విస్తరించాయి. 9 రోజులు ముందుగానే నైరుతి రుతుపవనాలు దేశవ్యాప్తంగా విస్తరించాయని భారత వాతావరణ శాఖ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మోహపాత్ర ఆకాశవాణి వార్తా విభాగానికి తెలిపారు. దేశ రాజధాని ఢిల్లీలో రుతుపవనాలు ప్రవేశించాయని, రానున్న రెండు రోజుల్లో ఢిల్లీ నగరంలో తేలికపాటి వర్షాలు కురుస్తాయని చెప్పారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =